# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 8, ఏప్రిల్, 2015

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య శాలలన్నింటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు.

సచివాలయంలో బుధవారం ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య శాఖ మంత్రి డా.లక్ష్మారెడ్డి, పార్లమెంటరీ సెక్రటరీ గాధరి కిషోర్, ఎంపి బూర నర్సయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, వైద్య శాఖ కార్యదర్శి సురేష్ చంద్ర, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఇతర వైద్య శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రస్తుతం ప్రభుత్వ వైద్య శాలలు వివిధ విభాగాల కింద పనిచేస్తున్నాయని, డాక్టర్లు కూడా చాలా విభాగాల కింద విడిపోయారని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ వైద్యాన్నంతా ఒకే గొడుగు కిందికి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక వైద్య శాలలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల ఏర్పాటు, నిర్వహణలో ఆచరణాత్మక విధానం రావాలన్నారు. 20 నుండి 25 వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలని, ప్రతి నియోజకవర్గంలో వంద గ్రామాలకు ఉపయోగపడే విధంగా ఏరియా ఆసుపత్రి ఉండాలన్నారు. రెవిన్యు జిల్లాల ప్రాతిపదికన కాకుండా భౌగోళిక పరిస్థితుల ఆధారంగా హెల్త్ డిస్ట్రిక్ట్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పిహెచ్‌సిలను 30 పడకల ఆసుపత్రిగా, ఏరియా ఆసుపత్రులను 100 పడకల ఆసుపత్రులుగా, జిల్లా ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా, హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఆసుపత్రులను 2000 పడకల ఆసుపత్రులుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆసుపత్రుల్లో పూర్తి స్థాయి సిబ్బంది, పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు, ట్రైబల్ ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉందని, ఈ విషయంలో వైద్యాధికారులు అధ్యయనం జరిపి ఏమి చేయాలనే విషయంపై కార్యాచరణ రూపొందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడానికి వైద్యులు ఎందుకు ముందుకు రావడం లేదో కూడా పరిశీలించాలని, వారికుండే సమస్యలను కూడా తెలుసుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే

వైద్యులకు ప్రత్యేక ఇన్‌సెంటివ్ ఇచ్చే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. 104, 108 సేవలు కూడా ప్రభుత్వ వైద్యంతో కలిసే ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆసుపత్రుల్లో సాంకేతిక పరికరాలను ఆపరేట్ చేయడానికి బయో మెడికల్ ఇంజనీర్లను నియమించాలని చెప్పారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య సేవలను యధావిధిగా కొనసాగిస్తూనే కొత్త భవనాలు నిర్మించాలని చెప్పారు. రెండు భారీ టవర్లను నిర్మించాల్సి ఉందన్నారు. గాంధీ ఆసుపత్రిలో కూడా అవసరమైన మరమ్మత్తులు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇన్, అవుట్ పేషంట్లు సగటున ఎంతమంది ఉంటున్నారు అనే విషయంలో కూడా సరైన అంచనాలు ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరాచాలన్నారు. ఆసుపత్రుల్లో రోగుల సహాయకుల కోసం ప్రత్యేక డార్మేటరీలు, బాత్రూమ్‌లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. వరంగల్ ఎంజిఎం ను కూడా చాలా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యశాలలను మెరుగుపరిచే విషయంలో కేంద్రం నుండి సహాయాన్ని తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి అన్నారు. దాదాపు 7 గంటల పాటు ముఖ్య అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, త్వరలోనే వైద్యులతో కూడా సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణకు అవసరమయ్యే సరైన వైద్య విధానాన్ని రూపొందించనున్నట్లు వెల్లడించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం